పండైపోతున్న పిండెలు



మచ్చలు పడి రాలిపోయిన మామిడిపిండెలు

- ఎండ తీవ్రతకు మచ్చ తెగులు
- వాడిపోయి రాలిపోతున్న మామిడిపిండెలు
- రైతులను వెంటాడుతున్న కష్టాలు

గుడిపాల: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మామిడి పంటకు మచ్చ తెగులు సోకుతోంది. 40 డిగ్రీల సెంటీగ్రేడ్ పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ఉగాది పండుగ వెళ్లిన నెలరోజులకు మామిడి కాయలు మోస్తరు సైజు వస్తాయి. కొన్నిచోట్ల పంట చేతికి రాకముందే కాయలు పిందె దశలో ఉండగానే తీవ్రమైన ఉష్ణోగ్రతకు చెట్టు మీదే పండిపోతున్నాయి. మరోవైపు ఎండిపోయి రాలిపోతున్నాయి. ఈ ఏడాది పంట అంతంత మాత్రంగా ఉండడమే కాకుండా రైతులు ప్రస్తుతం వేడి వల్ల రాలిపోతున్న పిందెలను చూసి బెంబేలెత్తుతున్నారు. రాబోయే సీజన్‌లో గాలి, వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉండడంతో మరింత నష్టం వాటిల్లుతుందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ పరిపక్వతకు రాకముందే పండిపోయి రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కాయ పెరగక ముందే రాలిపోతున్నాయని దీంతో తమకు నష్టాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని వారు వాపోతున్నారు. ఏటా ఏదో ఒక రూపంలో నష్టాలు చవిచూస్తున్న తమకు ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఏప్రిల్ చివర్లో మేలో మామిడి దిగుబడులు వస్తాయి. అయితే దానికి తగినట్లుగా కాయ పరిమాణం సరిగ్గా రాలేదు. వచ్చిన కొన్నిచోట్ల రాలిపోతుండడంతో తాము కౌలుకు తీసుకున్న తోటల ధరలకు గిట్టుబాటు అయ్యేలా లేవని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. దీంతో తమకు మామిడితోటలు మరింత నష్టాలు తెచ్చేలా ఉన్నాయని వాపోతున్నారు.

దిగుబడి లేనిపంట

ఈ సారి గ్రహణం, తెగుళ్ల సోకడంతో ఈ ఏడాది మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. పూత, పిందెలు ఎండకు మాడిపోతున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలో 3 వేలకు పైగా ఎకరాల్లో మామిడిని రైతులు సాగు చేస్తున్నారు. తెగుళ్ల, ఎండలు మామిడి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపడంతో పెద్దచెట్లకు మామిడికాయలు కాయని పరిస్థితి నెలకొంది. లక్షలు పెట్టుబడి పెట్టి దిగుబడి కోసం ఎదురుచూస్తున్న రైతుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది.



మామిడిచెట్లలో తక్కువగా కాసిన కాయలు

సాగుతో తీవ్ర నష్టం

తెగుళ్ల సోకి మూడెకరాల మామిడితోటంతా కాపు లేకుండా పోయింది. ప్రతి ఏడాది మామిడి దిగుబడితో రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చేది. ఈ ఏడాది కాపులేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. తోటలోని ఏ చెట్టుకు కూడా ఒక్క కాయలేదు. ఇంతటి దారుణ పరిస్థితి ఏనాడు చూడలేదు.

–చంద్రశేఖర్, 189 కొత్తపల్లె, రైతు

మామిడి పిందెలు రాలిపోతున్నాయి

ఎండలు అధికంగా రావడంతో వచ్చిన మామిడి పంటంతా ఎండిపోతోంది. దిగుబడి రాక ఓవైపు అల్లాడుతుంటే ఎండ వేడిమికి పిందెలు రాలిపోతున్నాయి. తనకున్న రెండెకరాల పొలంలో ఇప్పటికే రూ.30వేల వరకు ఖర్చుచేశా. ఖర్చుపెట్టిన డబ్బు కూడా చేతికందే పరిస్థితి కనిపించడం లేదు.

–బాలు, గొల్లమడుగు

క్లుప్తంగా

దారి సమస్య పరిష్కారం



దారిని సర్వే చేస్తున్న తహసీల్దార్ సుధాకర్, మండల సర్వేయర్ మురళీకృష్ణ

తవణంపల్లె: మండలంలోని నీలంపల్లె దగ్గర పొలాలకు వెళ్లే దారిని తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ సుధాకర్, మండల సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్‌ఓ ప్రకాష్, సచివాలయ సర్వేయర్లు షణ్ముగం, భార్గవి మత్యం రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబరు 195లో దారిని సర్వే చేసి కొలతలు వేయించి పరిష్కరించారు. ఉపాధి హామీ పథకం కింద రోడ్డు పనులు చేయిస్తామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాదమరి: మండలంలో పేకాడుతున్న ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ వరిగపల్లిలో పేకాడుతున్నారని సమాచారం అందిందన్నారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి దాడులు చేయగా ఎనిమిది మంది పట్టుబడినట్లు చెప్పారు. వారి నుంచి రూ.8,830 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



డీపీఓ సుధాకర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డీపీఓ సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడారు. పలు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 680 ప్రకారం రూ.10వేలకు పెంచాలన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గతంలో లాగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారానే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర, కార్యదర్శి గోవిందస్వామి మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీలో మరమ్మతు అయిన బ్యాటరీ వెహికల్స్ బాగు చేయించాలన్నారు. కార్మికుల సమస్యలపై ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలతో మాట్లాడి న్యాయం చేస్తామని డీపీఓ హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, గోపీనాథ్, మణి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు మేనేజర్‌కు హైబీపీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్ రవీంద్ర హైబీపీకి లోనై అస్వస్థతకు గురైన ఘటన చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా బస్టాండ్‌లోని మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వస్తున్నట్లు డీపీటీఓ జగదీష్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై మూడు రోజుల్లో మరుగు దొడ్లు శుభ్రం చేయించాలని బస్‌స్టేషన్ మేనేజర్ రవీంద్రను ఆర్ఎం ఆదేశించారు. అయితే శుభ్రం చేసినా మళ్లీ దుర్గంధం రావడంతో మంగళవారం రవీంద్రపై టీపీటీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన హైబీపీకి గురై పడిపోయారు. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది బస్టాండుకు సమీపంలోని ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుడిపాల: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటల ద్వారానే నేల ఆరోగ్యం, వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందన్నారు. రైతులు ప్రస్తుత వ్యవసాయంలో అధిక రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించడంతో ఆహారధాన్యాలు, కూరగాయలు, భూమి విషపూరితం అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. భూమిలేని నిరుపేద మహిళలు 365 రోజులు పెరటి తోటలు వేసుకోవాలన్నారు. త్వరలోనే గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవడానికి గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. తొలివిడతలో పేయనపల్లెలో రైతులు ఏఏ పంటలు సాగుచేస్తున్నారో తెలుసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ఉమ, వ్యవసాయాధికారి మాధవి, ఏపీయం సాయి సుధ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తవణంపల్లె: మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్లో 9వ తేదీన బుధవారం ఉదయం 11 నుంచి 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్, మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గర్భిణుల కాన్పులు, స్త్రీలకు కిడ్నీలు, మూత్రాశయానికి సంబంధించిన అన్ని వ్యాధులకు అపోలో మెడికల్ కళాశాల నుంచి గైనకాలజిస్టు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీలే కీలకం



అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్యామ్ సుగుణకుమారి

గుడిపాల: పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీలే కీలకమని అంగన్‌వాడీ సీడీపీవో శ్యామ్‌సుగుణకుమారి తెలిపారు. తుమ్మలవారిపల్లెలో మంగళవారం అంగన్‌వాడీలకు పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటపాటలతో విద్యార్థులకు విద్యను నేర్పించాలన్నారు. అనంతరం నెలవారీ సంబంధించి రికార్డులను ఆమె పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి పౌష్టికా హారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో యాద్రాక్షి పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చీరలను అందజేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గర్భిణీలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని స్థానిక ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. ఆశా కార్యకర్తలకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణుల నమోదుతో పాటు వారికి ఆరోగ్యసేవలు అందించే అంశంపై వారికి వివరించారు. గర్భవతుల వివరాలను 12 వారాల్లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విటమిన్-ఏ సిరప్‌ను పిల్లలకు తొమ్మిదో నెలలో మొదటిసారి ఇవ్వాలని, ఐదేళ్లు వచ్చే వరకు వారికి ప్రతి ఆరునెలలకోసారి ఇస్తూ ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లేటప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని 19 మంది ఆశా కార్యకర్తలకు రెండు జతల చీరలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ, సూపర్‌వైజర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదు



సరకల్లులో బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, వైద్య సేవలందస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: ఆరోగ్య భద్రతపై నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని సరకల్లులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 42 మందికి వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఆరోగ్య నియమాలను తప్పక పాటించాలన్నారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో ఆహారం తీసుకోవాలి

వృద్ధాప్యంలో సకాలంలో ఆహారం తీసుకోవాలని వైద్యాధికారి కేశవనారాయణ తెలిపారు. మండలంలోని మైనగుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. డాక్టర్ కేశవనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపరచుకోవాలన్నారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం మాజీ ఎంపీటీసీ దేవేంద్రరెడ్డికి మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ నివాళులర్పించారు. తుంబకుప్పంలో మంగళవారం దేవేంద్రరెడ్డి భౌతికకాయాన్ని సునీల్‌కుమార్ సందర్శించారు. పార్టీ ఓ మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీమాజీ చైర్మన్ కుమార్‌రాజా, రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ లీలావతమ్మ, మాజీ సర్పంచ్ అరుణామల్‌రెడ్డి, శాంతమ్మ, సీనియర్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు పాలాక్షిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృపాసాగర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి, బీసీ నాయకులు మార్కొండ, మునిరత్నం, మంజునాథ్ నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వేసవిలో వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: వేసవిలో వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని పొలకల రెడ్డివారిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వృద్ధులకు వేసవి ఎండల తీవ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మధ్యాహ్నం ఎండలో తిరగకుండా ఉండాలని తెలిపారు. వడదెబ్బ తగిలితే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సబ్ సెంటర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ఆశాలకు అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా, శిశు ఆరోగ్య కార్యక్రమాలను వందశాతం పూర్తి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాడే సందర్భంగా ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో అవసరమైన మందులు, ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉంచి, వారికి దిశా నిర్దేశం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, అందుకు అవసరమైన శిక్షణ, పరిజ్ఞానంపై ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. రక్తహీనతపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్ వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



అల్లుఅర్జున్ జన్మదిన వేడుకలో అభిమానులు

తవణంపల్లె: మండలంలోని వినాయకపురంలో మంగళవారం రాత్రి ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అల్లు అర్జున్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఆ కటౌట్‌కు పాలాభిషేకం చేయించి కొబ్బరికాయలతో దిష్టి తీయించారు. అనంతరం కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో అల్లు అర్జున్ అభిమానులు కృష్ణకాంతిక్, దుర్గేష్, శరత్‌బాబు, చరణ్, హరీష్, చంద్రశేఖర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అడిగినందుకు డీలర్ తిట్ల పురాణం

కార్వేటినగరం: రేషన్ బియ్యం కోసం పడిగాపులు పడక తప్పడం లేదని మంగళవారం బీసీ కాలనీవాసులు మండల తహసీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత 5 నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదని, జీవనం దారుణంగా మారిందన్నారు. ప్రతి నెల ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు కూడా దూరమయ్యాయని చెప్పారు. ఎండీయూ వాహన డ్రైవర్‌ను ప్రశ్నిస్తే సిబ్బందితో పాటు కలసి దౌర్జన్యం చేస్తూ తిట్ల పురాణం అందుకుంటున్నాడని తహసీల్దార్‌కు వివరించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ విచారణ చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలసముద్రం: మండల పరిధిలోని గర్భవతులు పౌష్టికాహారం తీసుకుంటే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశాలకు, ఆరోగ్య సిబ్బందికి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు సహా అన్ని ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా ఉన్నందున మజ్జిగ, పండ్ల రసం ఎక్కువగా తీసుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు సహాయంతో వెళ్లాలని తెలిపారు. గర్భవతులు రక్త పరీక్షలు చేసుకున్న తరువాతనే నెలసరి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతునిపై సీతారాముల వైభవం



తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోదండరామాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి హనుమంతుని సేవను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, అలంకరణ పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రిలో ఉభయదారులచే స్వామికి పూజాసామగ్రి, వస్త్రాలు, సుగంధపరిమళ పుష్పాలు, వివిధ రకాల ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. హనుమంతుడిపై కొలువుదీరిన సీతా సమేత కోదండరాముడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

జాడ లేని ప్లాస్టిక్ నిషేధం

- పట్నం నుంచి పల్లె వరకు ప్లాస్టిక్ మయం
- కొరవడిన క్షేత్రస్థాయి తనిఖీలు
- ప్రచారానికి నోచుకోని కాగితపు సంచులు
- పట్టించుకోని అధికారులు



బంగారుపాళెం: పాలిథిన్ (ప్లాస్టిక్) కవర్ల నిషేధ చట్టం మండలంలో అమలు కావడం లేదు. దుకాణాల్లో బహిరంగంగా ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా పట్టించుకునేవారు లేరు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అమ్మకపుదారులు, కొనుగోలుదారులు యథేచ్ఛగా ఈ కవర్లను వినియోగిస్తున్నారు. అసలు కాగితపు సంచుల వాడకం అసలు కనిపించడం లేదు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. కానీ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు దర్శనం ఇస్తూనే ఉన్నాయి.

మండలంలో 250 వరకు వివిధ రకాల పలు రకాల దుకాణాలు ఉన్నాయి. ఏ సమయంలోనైనా ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు లేని దుకాణాలు ఉండవు. కూరగాయల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ స్టాళ్లలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంది. ప్రతి రోజు 200 కిలోలకు పైగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల దుకాణాల్లో నెలకు రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల వరకు వ్యాపారాలు సాగుతున్నాయి. 40 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న కవర్ల విషయంలో అసలు నిబంధనలు పాటించడంలేదు. ఏ మురుగు నీటి కాలువలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనం ఇస్తున్నాయి. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల ఏళ్లు పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు వేయడం వల్ల అందులోని విషపదార్థాలు కలిసిపోతాయి. వాటిని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా ప్లాస్టిక్ వస్తువులను కాల్చడం ద్వారా విడుదలయ్యే విషవాయువుల వల్ల ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ విక్రయాలను తగ్గించి, ప్రజలకు కలిగే నష్టాలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్లాస్టిక్‌తో జబ్బులు

ప్లాస్టిక్ కవర్లలో పెట్టిన ఆహార పదార్థాలను తినడం వల్ల జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌లోని విషపదార్థాలు ఆహారంలో కలసి పోవడం వల్ల క్యాన్సర్‌తో పాటు గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తాయి. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండే ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్‌లోహిత్, మండల వైద్యాధికారి

చర్యలు తీసుకుంటాం

మండలంలో ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీలు చేపడతాం. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు విక్రయాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా సంఘాల ద్వారా కాగితపు సంచులు, ప్లేట్ల తయారీపై అవగాహన కల్పించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

–శ్రీధర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ